సాక్షి
మహబూబాబాద్

శుక్రవారం । 19 । మే । 2023



పల్లెలు 'స్వచ్ఛ'ం.. ప్రగతి మంత్రం

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఓడీఎఫ్ ప్లస్ కేటగిరీలో ఓరుగల్లు పల్లెలు మెరిశాయి. కాకతీయుల గడ్డ ఓడీఎఫ్ ప్లస్‌కు అడ్డాగా మారింది. - 8లో



విలువలు లేకుండా పోయాయి.. - 8లో

చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా ఈ పాలనలో సర్పంచ్‌లకు విలువలు లేకుండా పోయాయని నెల్లికుదురు మండల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

గరిష్టం/కనిష్టం 45.4°/28.3°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీస్తాయి. సాయంత్రం తర్వాత ఎండ నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.

న్యూస్‌రీల్

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మహబూబాబాద్ రూరల్: ప్రజలు సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాలపై ఎస్పీ మాట్లాడారు. స్పీడ్ పోస్టు రాలేదని, ఇంటర్‌నెట్‌లో పోస్టల్ కస్టమర్ కేర్ నంబర్ కోసం సెర్చ్ చేసి సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దన్నారు. ఇంటర్‌నెట్‌లో పోస్టల్ కస్టమర్ కేర్ నంబర్ కోసం సెర్చ్ చేసే సమయంలో సైబర్ నేరగాళ్లు రకరకాల నంబర్లు ఇస్తారని.. ఆ నంబర్లకు కాల్ చేయగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ అని నమ్మించి ఆర్థిక నేరాలకు పాల్పడుతారని చెప్పారు. మెసేజ్‌లు, లింక్స్ పంపి ఓపెన్ చేయమని చెప్పి డబ్బులు లాగేస్తారని పేర్కొన్నారు. పైవిధంగా ఎవరైనా మోసపోతే 1930కి ఫోన్ చేయడం ద్వారా కానీ, సైబర్ క్రైం వెబ్‌సైట్‌లో కానీ, సైబర్ క్రైం పోలీసులకు కానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధాకృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 19నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు అని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు పైబడి, పదో తరగతి పాసైన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఒరిజనల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిట్, రిజర్వేషన్ పొందుపర్చాలని, ఆప్షన్‌ల ద్వారా సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి




తొర్రూరు: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా కన్వీనర్ చింత మౌనిక తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఆర్డీఓ రమేష్‌కు అందజేశారు. ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఇస్సంపెల్లి సైదులు, జమ్ముల శ్రీను, మార్క సాంబయ్య, తిమ్మిడి రవి, హనుమంతు, రాధిక, రమ పాల్గొన్నారు.

యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వేణుమాధవ్



నెహ్రూసెంటర్: అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ఎడ్ల వేణుమాధవ్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల బాబురావుయాదవ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ.. సంఘం బలోపేతంతో పాటు యాదవుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, జాతీయ కార్యదర్శి లక్ష్మణ్, వరంగల్ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్‌ను సందర్శించిన ట్రెయినీ ఐఏఎస్



కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ను గురువారం ట్రెయినీ ఐఏఎస్ అగస్త్య అభినవ్ సందర్శించారు. మార్కెట్‌లో ఈ–నామ్ విధానం కింద వ్యాపారులు ఖరీదు చేసే తీరును, సరుకు తెచ్చినప్పటి నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే తీరును ఆయన పరిశీలించారు. ఆ తర్వాత మార్కెట్‌లో రైతులకు అందిస్తున్న రూ.5 భోజనాన్ని పరిశీలించారు. మార్కెట్ చైర్‌పర్సన్ సుహాసిని, డీఎంఓ వెంకట్‌రెడ్డి, డీఏఓ ఛత్రునాయక్, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు, సెక్రటరీ రాజా తదితరులు ఉన్నారు.

నిలువు దోపిడీ

తాలు, తరుగు పేరిట ధాన్యంలో కోత

- కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువ తూకం పెడుతున్న వైనం
- నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కు..
- 'సాక్షి' పరిశీలనలో తేటతెల్లం
- పలుచోట్ల ఆందోళనకు దిగుతున్న రైతులు



మరిపెడ మండలంలో జాతీయ రహదారిపై ధాన్యానికి నిప్పంటించి నిరసన తెలుపుతున్న రైతులు(ఫైల్)



మరిపెడ మండలం గుండెపుడి కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం రాశులు

సాక్షి పరిశీలన

రైతు చెమట చుక్కలే.. నీటి చుక్కలై పొలం పారింది. మట్టిని ముద్దాడి.. హలంపట్టి పొలం దున్నాడు. వడ్లు అలికి, నాటు వేసి, పచ్చని పైరును కన్న బిడ్డలా చూసుకున్నాడు. వరి కంకి పాలుపోసుకోవడం చూసి.. కష్టాలన్నీ తీరిపోతాయని సంబురపడ్డాడు. చేతికొచ్చిన పంటను కోత కోసి నూర్పిడి చేసి అమ్మకానికి తరలించాడు. తాలు తొలగించి, తేమ శాతం వచ్చేలా ఆరబెట్టాడు. అయితే ఆ రైతు రెక్కల కష్టాన్ని తన్నుకుపోయేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు ప్లాన్ చేస్తున్నారు. తాలు, తరుగు, తేమ పేరిట ధాన్యంలో కోత విధిస్తూ.. 2నుంచి 3కిలోల వరకు దోపిడీ చేసి రైతు రక్తం తాగుతున్నారు. ఇదేమిటనీ అడిగితే 'ఇక్కడ మేం చెప్పిందే రూల్' అనే రీతిలో మాట్లాడుతున్నారు. గురువారం జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో 'సాక్షి' పరిశీలన చేయగా.. ధాన్యం ఎక్కువగా తూకం వేస్తున్నారని తేలింది. 40.7కిలోలకు బదులు 2 నుంచి 3కిలోల వరకు ఎక్కువ తూకం వేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. కాగా జిల్లాలో కొన్నిచోట్ల కాంటాలు ఆలస్యం కావడం, ధాన్యంలో భారీగా కోత విధిస్తుండడంతో రైతులు రహదారులపై ధాన్యానికి నిప్పంటించి నిరసనలు తెలుపుతున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

తేమ, తాలు పేరుతో అన్యాయం



ఐకేపీ, పీఏసీఎస్, డీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులకు అన్యాయం చేస్తున్నారు. మిల్లర్లు, నిర్వాహకులు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారు. ప్రశ్నిస్తే మిల్లర్ల పేరు చెబుతున్నారు. సీతానగరం డీసీసీ కొనుగోలు కేంద్రంలో 42 కిలోలు తూకం పెడతామని, లేకుంటే కాంటాలు పెట్టమంటున్నారు. దళారుల కంటే నిర్వాహకుల దోపిడీ ఎక్కువైంది. జిల్లా కలెక్టర్ స్పందించాలి.

– శ్రీనివాస్, రైతు, సాంబయ్యపల్లి, గూడూరు

నెల రోజులుగా నిరీక్షణ



ఈ ఫొటోలోని రైతు పులుసు మల్లేశం మరిపెడ మండలంలోని గుండెపుడి ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి నెలరోజులు అవుతుంది. మూడెకరాల్లో పండిన సుమారు వంద బస్తాలు తూకం కూడా పెట్టారు. లారీలు కేటాయించకపోవడం, ట్రాక్టర్ల కొరత కారణంగా తూకం పెట్టిన ధాన్యం బస్తాలు నెల రోజుల నుంచి కొనుగోలు కేంద్రంలోనే ఉంటున్నాయి. చేసేది లేక బాధిత రైతు కొనుగోలు కేంద్రంలోనే పడిగాపులు కాస్తున్నాడు. తన వడ్లు మిల్లుకు తరలించాలని నిర్వాహకులను నిత్యం వేడుకుంటున్నాడు. కాగా నిర్వాహకులు పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించి ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నాడు.

బస్తాకు రెండు కిలోలు కోత



ఈ ఫొటోలోని రైతు పేరు జక్కుల మల్లేశం. జిల్లాలోని కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామం. ఇతను రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశాడు. పంట కోసం రూ.60వేలు పెట్టుబడి పెట్టాడు. వంద బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్మకం చేశాడు. కొనుగోలు కేంద్రం నుంచి లారీలో కొంత మంది రైతుల ధాన్యంతో కలిపి మిల్లుకు పంపించాడు. మిల్లుకు పోయిన తర్వాత తేమ శాతం, నాణ్యత తక్కువగా ఉందనే కారణంతో బస్తాకు రెండు కిలోల చొప్పున వడ్లు కోత పెట్టారు. వంద బస్తాలకు రెండు క్వింటాళ్ల వడ్లు కోత పడ్డాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

తరుగు పేరిట..



నాకున్న ఐదెకరాల్లో మూడెకరాలు వరి సాగు చేశాను. 137 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టి అమ్మాను. అయితే తరుగు పేరిట బస్తాకు అరకిలో కోత విధించారు. దీంతో కొంత మేర ఆర్థికంగా నష్టపోయా. ప్రభుత్వం ధాన్యం రైతుల సమస్యలు పరిష్కరించి, తరుగు పేరిట కోత విధించకుండా చూడాలి. రైతుల కష్టాలు తీర్చాలి.

– ఎడ్ల వెంకట్‌రెడ్డి, రైతు, పెద్దవంగర

క్రమబద్ధీకరణ రగడ!

ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు వసూలు

- 59జీఓ కింద 1,800 దరఖాస్తులు
- రూ.లక్షల్లో చెల్లించాలని నోటీసులు
- లబోదిబోమంటున్న దరఖాస్తుదారులు
- డబ్బులు చెల్లించని వారి ఇళ్ల కూల్చివేతలకు సిద్ధం
- అధికారులతో స్థానికుల వాగ్వాదం



గాంధీపురంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, జేసీబీని అడ్డుకున్న దరఖాస్తుదారులు (ఫైల్)

మహబూబాబాద్: ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం జీఓ 58, 58విడుదల చేసింది. 58జీఓ కింద దరఖాస్తు చేసుకుంటే 125గజాల లోపు స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. 125 గజాలపై పైన ఉన్నవారు జీఓ 59కింద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించాలి. కాగా జిల్లాలో 18,00మంది దరఖాస్తు చేసుకోగా.. రూ.లక్షల్లో చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరించుకోని వారి ఇళ్లను జేసీబీలతో కూల్చేందుకు సిద్ధపడుతున్నారు. గత వారం రోజులుగా మానుకోట పట్టణంలో కూల్చివేతలకు సిద్ధపడుతుండగా.. అధికారులు, దరఖాస్తుదారులకు మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఆందోళనలు కొనసాగుతున్నాయి.

2014 కంటే ముందు..

2014 జూన్ 2వ తేదీ కంటే ముందు ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో గృహాలు నిర్మించుకున్న వారి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీఓ 58,59 విడుదల చేసింది. 2022లో జీఓ 58కింద 5,401 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 4,970 దరఖాస్తులు జిల్లా కేంద్రానికి చెందినవే. కాగా 2022 మే నెలలో 15 రోజులు పాటు సర్వే చేశారు. జీఓ 59 కింద 1,800 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై కూడా సర్వే చేశారు.

1,800 దరఖాస్తులు..

జిల్లాలో 59జీఓ కింద 1,800 దరఖాస్తులు వచ్చాయి. మానుకోట మండలంలో 1,371 దరఖాస్తులు, మరిపెడ 210, చిన్నగూడూరు 42, గార్ల 6, పెద్దవంగర 3, కేసముద్రం 20, బయ్యారం 1, దంతాలపల్లి 18, తొర్రూరు 25, నెల్లికుదురు 7, డోర్నకల్ 7, కురవి 81, నర్సింహులపేట మండలంలో 9దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వాగ్వాదం.. ఆందోళనలు..

జిల్లాలో జీఓ 59కింద దరఖాస్తు చేసుకున్న వారికి మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలని అధికారులు నోటీస్‌లు ఇచ్చారు. అయితే రూ.లక్షల్లో చెల్లించలేమని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లా కేంద్రంలో నోటీస్‌లు అందజేసిన కొండపల్లి గోపాల్‌నగర్ కాలనీలో ఈ నెల 15న తహసీల్దార్ ఇమ్మానీయేల్ పర్యటించి డబ్బులు చెల్లించాలని దరఖాస్తుదారులకు సూచించారు. అయితే తాము డబ్బులు చెల్లించలేమని, ఆ భూమి అమ్మినా అంత డబ్బురాదని ఆందోళన చేశారు. ఈ క్రమంలో అధికారులతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నెల16న తహసీల్దార్ ఇమ్మానీయేల్ రెవెన్యూ సిబ్బంది, జేసీబీతో జిల్లా కేంద్రంలోని నాల్గో వార్డు పరిధిలోని గాంధీపురం వెళ్లగా దరఖాస్తుదారులు అడ్డుకున్నారు. జేసీబీతో ఇళ్లు కూల్చివేయడం భావ్యం కాదని అధికారులపై మండిపడ్డారు. చేసేదేమీ లేక తహసీల్దార్, సిబ్బంది జేసీబీతో వెనుదిరిగారు. ఈ విషయంపై పలు పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఈ నెల చివరి వరకు గడువు..

జిల్లాలో జీఓ 58,59కింద దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఇచ్చింది. కాగా జీఓ58 కింద మాత్రమే దరఖాస్తులు వస్తున్నాయి. 59జీఓ కింద దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావడం లేదు. కాగా కలెక్టర్ శశాంక పలుమార్లు సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి 58,59జీఓల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు జీఓ 59పై పలు కార్యక్రమాలు నిర్వహించినా.. దరఖాస్తులు మాత్రం రావడం లేదు. తాము రూ.లక్షల్లో చెల్లించలేమని పేదలు వాపోతున్నారు.

వాయిదాల్లో చెల్లించుకోవచ్చు

ఇచ్చిన నోటీస్‌ల ప్రకారం మూడు వాయిదాల్లో డబ్బులు చెల్లించవచ్చు. ముందుగా మొదటి వాయిదా చెల్లించాలి. మూడు వాయిదాలు చెల్లిస్తే కార్యాలయంలో ఆభూమి రిజిస్ట్రేషన్ చేయించి అన్ని హక్కులు కల్పిస్తాం. ఆ భూమిని విక్రయించవచ్చు. బ్యాంక్ రుణాలు తీసుకోవడంతో పాటు మార్టిగేజ్ కూడా చేసుకోవచ్చు. మానుకోట మండలం నుంచి సుమారు రూ.25 కోట్లు రావాలి. దరఖాస్తుదారులు సహకరించాలి.

– ఇమ్మానీయేల్, మానుకోట తహసీల్దార్

వ్యాపారుల లైసెన్స్ రద్దు చేయాలి



రాస్తారోకో చేస్తున్న రైతులు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

మహబూబాబాద్ రూరల్: రైతులను మోసం చేసిన వ్యాపారుల లైసెన్స్ రద్దు చేసి, వారికి సహకరిస్తున్న అధికారులు, సూపర్‌వైజర్లను వెంటనే సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ధరల కేటాయింపు విషయంలో వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎదుట ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ.. మానుకోట మార్కెట్‌కు బుధవారం బయ్యారం మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన బానోతు వెంకన్న అనే రైతు 45 క్వింటాళ్ల ధాన్యం తీసుకురాగా శ్రీపద్మజ ఇండస్ట్రీస్ వ్యాపారి ఈ–నామ్ వేలంలో పాల్గొని క్వింటాకు ధర రూ.1,946 చొప్పున కొనుగోలు చేసి, అనంతరం వేరే వ్యాపారితో సిండికేట్ అయి ధర తగ్గించి రూ.1,760 చొప్పున తీసుకొని రైతుకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై రైతు వెంకన్న మార్కెట్ అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, అధికారులు, వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా సమస్యను ఏఎంసీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లగా.. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు బానోత్ సిద్దు నాయక్, మండల అధ్యక్షుడు కేలోతు రమేష్ నాయక్,సిరోల్ మండల అధ్యక్షుడు బానోత్ రాందాస్ నాయక్, జిల్లా యువజన అధ్యక్షుడు రమేష్ నాయక్, రైతులు బానోత్ బుజ్జి, సయ్యద్, వెంకన్న, శారద, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లు సీఎంఆర్ పెట్టాలి

● కలెక్టర్ శశాంక

కురవి: మిల్లర్లు సీఎంఆర్ పెట్టాలని, జాప్యం చేయవద్దని కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం మండలంలోని అయ్యగారిపల్లి వద్ద ఉన్న శ్రీ తిరుమల పారాబాయిల్డ్ రైస్‌మిల్‌ను అదనపు కలెక్టర్ డేవిడ్, సివిల్ సప్లయీస్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. మిల్లులో ఉన్న ధాన్యాన్ని లెక్కించి నివేదిక అందించాలని ఆదేశించారు. మిల్లులో ఉన్న ధాన్యంపై పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సీఎంఆర్ సకాలంలో అందించడంలో జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ కృష్ణవేణి, తహసీల్దార్ రఫీ, సివిల్ సప్లయీస్ డీటీ నారాయణరెడ్డి, తిరుమల రైస్ మిల్లు యజమాని అంబరీష ఉన్నారు.

అనుమతులు తీసుకోవాలి

మహబూబాబాద్: జిల్లాలోని కొత్తగూడ, గంగారం ఏజెన్సీ మండలాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు అటవీశాఖ నుంచి సత్వరమే అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏజెన్సీ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు తీసుకోవాల్సిన అనుమతులపై జిల్లా అటవీశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో గుంజేడు దుబ్బగూడ, భూపతిపేట నుంచి కొత్తగూడ, కొత్తగూడ నుంచి పాకాల రోడ్లకు అనుమతులు పొందాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆరు రోడ్లకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఐటీడీఏ ద్వారా మూడు రోడ్లకు అనుమతులు తీసుకోవాలన్నారు. మత్స్యశాఖ ద్వారా చేపట్టనున్న పాండ్స్ నిర్మాణాలకు తీర్మానం చేసిన తర్వాత అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ రవికిరణ్, ఆర్డీఓ కొమురయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

హరితహారం కార్యక్రమం పక్కా ప్రణాళికతో విజయవంతం చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో హరితహారం కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 49.64లక్షల మొక్కలు నాటేవిధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 7.50లక్షలు, పలు శాఖల ఆధ్వర్యంలో 42లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. డీఎఫ్ఓ రవికిరణ్ మాట్లాడారు. అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, జెడ్పీ సీఈఓ రమాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

వెంటనే తరలించాలి..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 9 గంటల వరకు లారీలు, ట్రాక్టర్లు కేంద్రాల వద్ద ఉండాలన్నారు. సాయంత్రం మూడు నుంచి ఐదు గంటలలోపు రవాణా చేపట్టాలన్నారు.

అనాథగా మారిన బాలిక

నెలల వ్యవధిలో తల్లిదండ్రుల మృతి

డోర్నకల్: నెలల వ్యవధిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో ఓ బాలిక అనాథగా మారిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. డోర్నకల్‌లోని బుద్ధారం రోడ్‌లో నివాసం ఉండే టోనీ(39),సంధ్యారాణి(36) దంపతులకు రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల కూతురు విక్టోరియా ఉంది. టోనీ పెయింటర్‌గా పని చేసి కుటుంబాన్ని పోషించేవాడు. సాఫీగా సాగుతున్న ఆ కుటుంబంలో పెద్ద సమస్య వచ్చి పడింది. రెండేళ్లక్రితం సంధ్యారాణి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా భర్త టోనీ వారానికి రెండుసార్లు ఆమెను ఖమ్మం తీసుకెళ్లి డయాలసిస్ చేయించాడు. ఈ క్రమంలో గత జనవరి 11న టోనీ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందాడు. కాగా సంధ్యారాణి వ్యాధి ముదిరి నాలుగు రోజుల క్రితం కోమాలోకి వెళ్లి బుధవారం రాత్రి మృతి చెందింది. దీంతో కూతురు విక్టోరియా తల్లిదండ్రులిద్దరిని కోల్పోయి అనాథగా మారింది. సంధ్యారాణి అంత్యక్రియలను ఆమె తల్లి, సోదరి, ఇతర కుటుంబ సభ్యులు స్థానికుల సహకారంతో నిర్వహించారు. ప్రస్తుతం విక్టోరియా అనాథగా మారి దీనావస్థలో ఉంది.



తల్లి సంధ్యారాణి మృతదేహం వద్ద విక్టోరియా

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ద్వారా రాష్ట్రంలోని 11 స్టడీ సర్కిళ్లలో 5 నెలల ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ అభ్యర్థులు నేటి నుంచి సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సన్యాసయ్య గురువారం తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 21న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర సీనియర్ బాలబాలికల జిల్లాస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ ఎంపిక పోటీలు ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాస నాగమణి గురువారం తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలని, ఇక్కడ సెలెక్ట్ అయిన వారు ఈ నెల 25, 26న ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9052670288 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతీ కాలనీకి మిషన్ భగీరథ కొత్త పైపులైన్ నిర్మాణం చేపట్టాలన్నారు. పలు కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైన్ కనెక్షన్ పాత పైపులైన్‌కు ఇవ్వడం వల్ల అవి పగిలి రోడ్డుమీద నీరు వృథాగా పోతోందన్నారు. జ్యోతిబస్ కాలనీతో పాటు పలు కాలనీలకు పైపులైన్ నిర్మాణంతో పాటు నల్లాలు ఏర్పాటు చేసినా నేటి వరకు నీటి సరఫరా చేయడం లేదన్నారు. ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ఇంటింటికీ భగీరథ తాగునీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్ ప్రసన్నరాణికి వినతిపత్రం అందజేశారు.

డీఎంఎఫ్‌టీ నిధులపై హక్కులు కల్పించాలి

బయ్యారం: డీఎంఎఫ్‌టీ నిధులు సర్పంచులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల సర్పంచులు గురువారం కలెక్టర్ శశాంకకు వినతి ఇచ్చారు. డీఎంఎఫ్‌టీ పనులు సర్పంచులు చేసుకోవడానికి వీలు లేకుండా ఇల్లెందు ఎమ్మెల్యే అనుచరులు, వైస్ ఎంపీపీ గణేష్ తీర్మానాలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. తీర్మానాలు ఇవ్వని జీపీల్లో పనులు నిలిపివేస్తామని భయ పెడుతున్నారన్నారు. సర్పంచులు వెంకటేశ్వర్లు, మణి, వెంకటరమణ, అనసూర్య, స్వరూప ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

మహబూబాబాద్: అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాం నాయక్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకకు రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వేగంగా సేకరించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో తూకంలో మోసం చేయడం సరికాదని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు రుణమాఫీ చేసి కొత్తగా రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తోట వెంకన్న, నూనావత్ రాధ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రేడ్‌-2 కార్యదర్శిగా విధుల్లో చేరిన రాము



వరంగల్‌: ఏనుమాములలోని వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌ గ్రేడ్‌-2 కార్యదర్శిగా నియమితులైన శ్రీరామోజు రాము గురువారం జాయిన్‌ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న గ్రేడ్‌-2 కార్యదర్శి తోట చందర్‌రావు పదోన్నతిపై నల్గొండ జిల్లా నిడమనూరు మార్కెట్‌ కమిటీ గ్రేడ్‌-1 కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్‌ బోథ్‌ మార్కెట్‌ కమిటీలో గ్రేడ్‌-3 కార్యదర్శిగా పనిచేస్తున్న రాము గ్రేడ్‌-2 కార్యదర్శిగా పదోన్నతి పొందడంతో వరంగల్‌ మార్కెట్‌లో గ్రేడ్‌-2 బదిలీపై వచ్చారు. ఆయన మార్కెట్‌ ఎస్‌జీఎస్‌ బీవీ.రాహుల్‌ను కలసి జాయినింగ్‌ రిపోర్టు అందించారు. నూతనంగా వచ్చిన గ్రేడ్‌-2 రామును మార్కెట్‌ ఉద్యోగులు, సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే ట్రాఫిక్‌ బ్లాక్‌తో పలు రైళ్ల రద్దు

కాజీపేట రూరల్‌/కాశిబుగ్గ: సికింద్రాబాద్‌ రైల్వే డివిజన్‌ పరిధిలోని ఘట్‌కేసర్‌- చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే నిర్మాణ పనుల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈనెల 21వ తేదీన ట్రాఫిక్‌ బ్లాక్‌ చేపట్టినట్లు గురువారం రాత్రి తెలిపారు. ట్రాఫిక్‌ బ్లాక్‌తో కాజీపేట, వరంగల్‌ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దుతోపాటు రీషెడ్యూల్‌ చేసినట్లు వెల్లడించారు.

రద్దయ్యే రైళ్లు..

కాజీపేట- సికింద్రాబాద్‌, సికింద్రాబాద్‌ - వరంగల్‌, వరంగల్‌- హైదరాబాద్‌ వెళ్లే పుష్‌పుల్‌, హైదరాబాద్‌- సిర్పూర్‌ కాగజ్‌నగర్‌, సిర్పూర్‌ కాగజ్‌నగర్‌- హైదరాబాద్‌, సిర్పూర్‌ కాగజ్‌నగర్‌- సికింద్రాబాద్‌, సికింద్రాబాద్‌- గుంటూరు(గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌), గుంటూరు- సికింద్రాబాద్‌, సికింద్రాబాద్‌- సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.



చాలెంజింగ్‌ చౌళ్లపెల్లి: హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపెల్లి గ్రామం ఇది. ఈ గ్రామంలో 600 కుటుంబాలు, మూడు వేల మంది వరకు జనాభా ఉంటుంది. ఈ గ్రామాన్ని బహిరంగ మల విసర్జన లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఊరి ప్రజలు 2018లో కంకణం కట్టుకున్నారు. ప్రతి కుటుంబం మరుగుదొడ్డిని నిర్మించుకోవడమే కాకుండా 100శాతం వాడుతున్న ఈ గ్రామం మండలంలో ఆదర్శంగా నిలిచింది.



ఓడీఎఫ్‌ ఆరాటం.. మూడేళ్ల పోరాటం : జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గుంటూరుపల్లి గ్రామం ఇది. బహిరంగ మల విసర్జన లేని గ్రామం (ఓడీఎఫ్‌) కోసం ఆ ఊరి ప్రజలు ప్రతినబూనారు. ఈసారి ప్రకటించిన జాబితాలో గుంటూరుపల్లి ఉంది. 201 ఇళ్లు 727 మంది ఉన్న ఈ గ్రామంలో పురుషులు 354, మహిళలు 373 మంది కాగా సర్పంచ్‌ కూడా మహిళనే.



స్టేషన్‌ఘన్‌పూర్‌ ది గ్రేట్‌: స్టేషన్‌ఘన్‌పూర్‌ గ్రామంలో 12,721 జనాభా, 3,862 కుటుంబాలు ఉన్నాయి. ఓడీఎఫ్‌ కోసం బహిరంగ మల విసర్జన చేస్తే రూ.500 రూపాయలు జరిమానా విధించారు. ప్రభుత్వం నుంచి మరుగుదొడ్ల నిర్మాణానికి అందించిన ఆర్థిక ప్రోత్సాహాలను ప్రజలకు అందించి వారిని చైతన్యం చేయడం ద్వారా సుమారు ఐదేళ్ల పాటు సాగిన ఉద్యమంలో సర్పంచ్‌, వార్డు సభ్యుల పట్టుదల, ప్రజల భాగస్వామ్యంతో ఓడీఎఫ్‌గా ఘనత సాధించింది.

పల్లెలు 'స్వచ్ఛ'ం.. ప్రగతి మంత్రం

- ఓడీఎఫ్‌ ప్లస్‌లో మెరిసిన ఓరుగల్లు పల్లెలు
- నూరుశాతం ఓడీఎఫ్‌ గ్రామాలు..

సాక్షిప్రతినిధి, వరంగల్‌: స్వచ్ఛభారత్‌ మిషన్‌లో భాగంగా ఓడీఎఫ్‌ ప్లస్‌ కేటగిరీలో ఓరుగల్లు పల్లెలు మెరిశాయి. కాకతీయుల గడ్డ ఓడీఎఫ్‌ ప్లస్‌కు (బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలు) అడ్డాగా మారింది. 2018 నుంచి కంకణబద్ధులై చేస్తున్న ఉద్యమం ఫలించింది. ఉమ్మడి వరంగల్‌లో 1,688 (నూరుశాతం) గ్రామాలు ఓడీఎఫ్‌ ప్లస్‌ సాధించి రికార్డుకెక్కాయి. బహిరంగ మల విసర్జన నుంచి విముక్తి పొందిన ఈ గ్రామాల్లో ఘన లేదా ద్రవ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ అమల్లో ఉంటే వాటిని ఓడీఎఫ్‌ ప్లస్‌ గ్రామాలుగా పిలుస్తారు. ఈమేరకు గ్రామీణ స్వచ్ఛభారత్‌ మిషన్‌ రెండో దశ ఫలితాలను కేంద్ర జల్‌శక్తి శాఖ ఇటీవల వెల్లడించింది. స్వచ్ఛభారత్‌ మిషన్‌లో భారత్‌ మరో మైలురాయిని దాటినట్లు పేర్కొంది. మిషన్‌ రెండో దశలో దేశవ్యాప్తంగా 51.91శాతం గ్రామాలు ఓడీఎఫ్‌ ప్లస్‌ స్థాయికి చేరాయని.. ఇందులో 100% ఫలితాలు సాధించి తెలంగాణ టాప్‌లో నిలిచినట్లు వెల్లడించగా, ఉమ్మడి వరంగల్‌ గ్రామాలు మొదటి వరుసలో నిలిచాయి.

తెలంగాణ ప్రజలకు అభినందనలు



ఓడీఎఫ్‌ ప్లస్‌లో తెలంగాణ మొదటి స్థానంలో నిలవడం తెలంగాణ ప్రజల సమష్టి విజయం. అందరికీ అభినందనలు. బహిరంగ మల విసర్జన రహిత స్థితిని కొనసాగించడం, బయో-డిగ్రేడబుల్‌, పీవీఎం, ఎల్‌వీఎం తదితర చర్యలను తెలంగాణ సమర్థంగా కొనసాగిస్తోంది. ఈ కారణంగానే ఓడీఎఫ్‌ ప్లస్‌ అములులో తెలంగాణకు 100 శాతం వచ్చింది. ఇందులో సీఎం కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌ల ప్రోత్సాహం ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు అభినందనలు.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి

అందరి సహకారంతో 100 శాతం ఓడీఎఫ్‌



మా గ్రామంలో అందరి సహకారంతో 100శాతం ఓడీఎఫ్‌ సాధించాం. మహిళా సంఘాలతో అవగాహన కల్పించాం. గ్రామంలో దండోరా వేయించి వాల్‌ రైటింగ్‌ రాయించాం. ఉపసర్పంచ్‌, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ, జీపీ సిబ్బంది అందరు రాజకీయాలకు అతీతంగా శ్రమించారు.

- కంచ రవికుమార్‌, సర్పంచ్‌, చౌళ్లపెల్లి

మూడేళ్ల ఆరాటం... ప్రజల సహకారం



మా గ్రామంలో మరుగుదొడ్లు 100 శాతం ప్రజల సహకారంతో పూర్తి చేశాం. ప్రభుత్వం చేపట్టిన పథకంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరిగి ఒక మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాం. దీంతో పరిసరాల పరిశుభ్రత, సమాజంలో ఇబ్బంది పడే అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లాం. గ్రామంలోని కొంతమందికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో వాటి నిర్మించుకోవడానికి మూడేళ్లు పట్టింది.

- పువ్వాటి రాణి, సర్పంచ్‌, గుంటూరుపల్లి

నూరుశాతం ఓడీఎఫ్‌... చాలా సంతోషంగా ఉంది



అందరి కృషితోనే జనగామ జిల్లా (281 గ్రామాలు) వందశాతం ఓడీఎఫ్‌గా సాధించింది. కలెక్టర్‌ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సదస్సులు ఏర్పాటు చేసినం. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ... వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రతి వ్యక్తికి అవగాహన కల్పించాం. తగిన ఫలితం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

- గూడూరు రాంరెడ్డి, ఆర్డీఓ, జనగామ

వడదెబ్బతో కూలీ మృతి



లక్ష్మి(ఫైల్‌)

కేసముద్రం: వడదెబ్బకు గురైన ఓ మహిళా కూలీ గురువారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన బొంపెల్లి లక్ష్మి(45) కేసముద్రం మార్కెట్‌ పరిధిలోని ఓ ట్రేడింగ్‌ కంపెనీలో కూలీగా పనిచేస్తుంది. ఈ క్రమంలో బుధవారం కూలీ పనికి వెళ్లిన ఆమె ఎండదెబ్బతో అస్వస్థతకు గురైంది. ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె ఇంట్లోనే మృతి చెందింది.

గట్టికల్‌లో బాలుడు..



మణికంఠ మృతదేహం

రాయపర్తి: వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలంలోని గట్టికల్‌ గ్రామానికి చెందిన కాంబోతు ప్రభాకర్‌ కుమారుడు మణికంఠ (12) వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికంఠ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు బతుకుదెరువుకోసం వెళ్లారు. ఈక్రమంలో మణికంఠ వడదెబ్బకు గురై అస్వస్థకు గురికావడంతో గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించగా గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామం గట్టికల్‌ తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

వడదెబ్బతో వృద్ధురాలు..



మాలి (ఫైల్‌)

గార్ల: ఎండ తీవ్రత, వడగాడ్పులకు తట్టుకోలేక ఓ వృద్ధురాలు వడదెబ్బకు గురై మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా గార్ల మండలం మద్దివంచ పంచాయతీ కొత్తతండాకు చెందిన సపావట్‌ మాలి(70) ఎండలు, వడగాడ్పులకు తట్టుకోలేక వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురై గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మాలి మృతదేహాన్ని వైస్‌ ఎంపీపీ కట్టిబోయిన శ్రీనివాసరావు సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కాంట్రాక్టు లెక్చరర్ల బైక్‌ ర్యాలీ

కేయూ క్యాంపస్‌: యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేయాలని కుక్టా నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు కేయూ మొదటి గేట్‌ నుంచి రెండో గేట్‌వరకు గురువారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్టా అధ్యక్షుడు డాక్టర్‌ శ్రీధర్‌కుమార్‌ లోథ్‌ మాట్లాడుతూ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. రవీందర్‌, మధుకర్‌రావు, చంద్రశేఖర్‌, గడ్డం కృష్ణ, ప్రసన్నరాణి, లక్ష్మి, కల్పన, సంగీతకుమార్‌, విజయ్‌కుమార్‌, రాకేష్‌రెడ్డి, సురేందర్‌, కుమార్‌, రవీందర్‌, మల్లేష్‌, బ్రహ్మయ్య తదితరులున్నారు.

రెడ్డి చికెన్‌ సెంటర్‌
Cell: 9989299661

అన్నపుట్టిన రోజునే తమ్ముడి మృతి

- ఆర్టీసీ బస్సు-ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఘటన
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్న



వినయ్‌ మృతదేహం

హసన్‌పర్తి: అన్నదమ్ములిద్దరూ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. స్వగ్రామాన్ని విడిచి బతుకుదెరువు కోసం వేరే ఊరికి వెళ్లారు. ఈక్రమంలో అన్న పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులతో నిర్వహించుకునేందుకు గురువారం తెల్లవారుజామున స్వగ్రామానికి పయనమైన వారిని బస్సు రూపంలో ప్రమాదం వెంటాడింది. దీంతో తమ్ముడు మృతి చెందగా.. అన్న ఆస్పత్రి పాలయ్యాడు. ఈఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం రాంపూర్‌కు చెందిన మునిగాల సుధాకర్‌కు ఇద్దరు కుమారులు విజయ్‌, వినయ్‌(25). నెలరోజులుగా వీరిద్దరూ హుజూరాబాద్‌లో ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నారు. ఈక్రమంలో బుధవారం తెల్లవారుజామున అన్నదమ్ములిద్దరూ హుజూరాబాద్‌ నుంచి స్వగ్రామానికి ద్విచకవాహనంపై బయల్దేరారు. విజయ్‌ వాహనం నడుపుతుండగా, వినయ్‌ వెనుక కూర్చున్నాడు. బాహుపేట క్రాస్‌వద్దకు చేరుకోగానే, హనుమకొండ నుంచి నిజామాబాద్‌ వెళ్తున్న బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వినయ్‌ అక్కడిక్కడే మృతి చెందగా.. విజయ్‌కు బలమైన గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్‌ నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఆర్టీసీ బస్సు అజాగ్రత్తగా నడిపి తన కుమారుడు వినయ్‌ మృతికి కారకుడైన డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి సుధాకర్‌ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రాణం తీసిన ఈత సరదా



సమ్మయ్య మృతదేహం

టేకుమట్ల(రేగొండ): సరదా కోసం ఈతకు వెళ్లి ప్రాణాలను కోల్పోయిన సంఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని దమ్మన్నపేట శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని చెన్నాపూర్‌కు చెందిన సూరం సమ్మయ్య(32), హమాలీగా కూలీ పని చేస్తుంటాడు. రోజువారీలాగే పని ముగిశాక తోటి కూలీలతో కలిసి సరదాగా దమ్మన్నపేట శివారులోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. వ్యవసాయ బావి మోటార్‌కు ఉన్న తాడు తొలగించి కాసేపు ఈత సరదా తీర్చుకున్నారు. మోటార్‌ తాడు నీటి అడుగుకు చేరుకోగా తాడును తీసుకొచ్చేందుకు సమ్మయ్య నీటి అడుగు భాగానికి వెళ్లి ఊపిరాడక మృతి చెందాడు. దీంతో తోటి కార్మికులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరక్కపోవడంతో పరకాల ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని సమ్మయ్య మృతదేహాన్ని వెలికితీశారు. కాగా, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

భార్యను కత్తెరతో పొడిచిన భర్త

- జనగామ ఆస్పత్రికి తరలింపు



గాయపడిన భాగ్యలక్ష్మి

నర్మెట: భార్య తల వెంట్రుకలు కత్తిరించి అదే కత్తెరతో తలపై భర్త తీవ్రంగా గాయపరచిన ఘటన మండలంలోని అమ్మాపురంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా నర్మెట మండలంలోని అమ్మాపురానికి చెందిన బైరగోని భాస్కర్‌కు జనగామ గిర్నిగడ్డకు చెందిన భాగ్యలక్ష్మితో పదమూడేండ్ల క్రితం వివాహం జరగగా ఇద్దరు సంతానం అక్షర, సాయి. ఈక్రమంలో హైదరాబాద్‌లో నివాసముంటున్న భార్యభర్తల మధ్య కలహాలు చోటు చేసుకోవడంతో పలు మార్లు పెద్దలు సర్దిచెప్పినా ఫలితం లేకపోయింది. ఈనేపథ్యంలో భాస్కర్‌ హైదరాబాద్‌లో భార్య నాగలక్ష్మి అమ్మాపురంలోనే అద్దె ఇంట్లో పిల్లలతో కలసి నివాసముంటున్నది. ఈక్రమంలో గురువారం రాత్రి అకస్మాత్తుగా వచ్చిన భాస్కర్‌ ఇంట్లో చొరబడి భార్యపై దాడి చేశాడు. అడ్డుగా వచ్చిన పొరుగింటి రేఖ, కూతురు అక్షరపై దాడిచేయడంతో పాటు వెంట తెచ్చుకున్న పెట్రోలును తన ద్విచక్ర వాహనంపై పోసి నిప్పటించి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ప్రైవేటు వాహనంలో భాగ్యలక్ష్మిని జనగామ ఆస్పత్రికి తరలించారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

దంతాలపల్లి: మానుకోట జిల్లా దంతాపల్లి మండలకేంద్రంలో లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూచిపూడి జగదీష్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలప్రకారం మండల కేంద్రానికి చెందిన తూర్పటి శివరాం(51) గురువారం ఉదయం తన ఇంటి దగ్గరనుంచి చాయ్‌ తాగేందుకు సెంటరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో సూర్యాపేట వైపు నుంచి కట్రలోడుతో వరంగల్‌ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్‌ అతివేగంగా అజాగ్రత్తతో నడుపుతూ శివరామ్‌ను ఢీ కొనడంతో ఆయన రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చికిత్సనిమిత్తం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు అసిఫాబాద్‌ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్‌ పిప్రే ప్రకాష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూమి మాది.. కాదు మాది



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న కడిపికొండ దళితులు

కాజీపేట అర్బన్‌ : కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని సర్వే నంబర్‌ 366లోని పంచారాయి భూమి మాదంటే మాది అంటు కడిపికొండకు చెందిన దళితులు, టీఎన్జీవోస్‌ ఉద్యోగులు గురువారం పరస్పరం వాగ్వాదానికి దిగారు. టీఎన్జీవోస్‌ ఉద్యోగులు పంచరాయి భూమిని ప్రభుత్వం తమకు కేటాయించిందంటూ గురువారం సర్వేయర్‌ సారంగపాణితో భూసర్వే నిర్వహించేందుకు యత్నించగా భూమి విషయం హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి సర్వే ఎలా నిర్వహిస్తారని అడ్డుకున్నామని కడిపికొండ దళితులు తెలిపారు. పదేండ్లుగా పంచరాయి భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న టీఎన్జీవోస్‌ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భూ హక్కుదారులమైన మాకు అప్పగించాలని కలెక్టరేట్‌ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొండూరి రవి, బస్కె దశరథం, నాగేందర్‌రావు, అనిత, బస్కె రాజేందర్‌, ప్రదీప్‌, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఓ వైపు టీఎన్జీవోస్‌ అధికారులు, కడిపికొండ దళితుల నడుమ వాగ్వాదం జరుగుతుండగానే ఓ పార్టీకి చెందిన నాయకులు గుడిసెలు వేయించడం చర్చనీయాంశంగా మారింది.

సర్పంచ్‌లకు విలువలు లేకుండా పోయాయి



సమావేశంలో పాల్గొన్న వివిధ గ్రామాల సర్పంచ్‌లు

- ఈ - పాలనలో సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా కార్యదర్శులు బిల్లులు డ్రా చేయడాన్ని నిలువరించాలి
- 36 గ్రామాల సర్పంచ్‌ల ఆవేదన

నెల్లికుదురు: చేసిన పనులకు బిల్లులురాక తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా ఈ పాలనలో సర్పంచ్‌లకు విలువలు లేకుండా పోయాయని మహబూబాబాద్‌ జిల్లా నెల్లికుదురు మండల పరిధిలోని 36 గ్రామాల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నెల్లికుదురులో గురువారం ప్రత్యేకంగా సమావేశమై తమ సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని ఆదేశాలు ఇవ్వడమే తప్ప చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని, కాని పనులు చేయకుంటే నోటీసులు పంపి సర్పంచ్‌లకు విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా పంచాయతీ కార్యదర్శులు బిల్లులు విడుదల చేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్‌ చేశారు. శానిటేషన్‌ పెండింగ్‌ బిల్లులు విడుదల చేసిన తర్వాతనే శానిటేషన్‌ పనులు నిర్వహిస్తామని, అప్పటివరకు వాయిదా వేయాలని కోరుతూ ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. సమావేశంలో సర్పంచ్‌లు బీరవెల్లి యాదగిరిరెడ్డి, భీముడు, జయపాల్‌రెడ్డి, అశోక్‌, అనిల్‌, నారాయణరెడ్డి, బిక్కునాయక్‌ పాల్గొన్నారు.

దేవుడి సొమ్ముకు శఠగోపం

- తొమ్మిది వెండి చెంబులు మాయం
- విచారణ చేస్తున్న మట్టెవాడ పోలీసులు

వరంగల్‌ చౌరస్తా: వరంగల్‌ బట్టలబజారు వేంకటేశ్వర స్వామి దేవాలయం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారిందనడంలో సందేహం లేదు. సగటు భక్తుడు కనీస సౌకర్యాల్లేక అల్లాడుతున్న పట్టించుకునే వారు లేరు. కానీ స్వామి వారి ఆలయం ఆదాయాన్ని అందిన కాడికి వాటాలుగా నైవేద్యంగా పంపకాలు చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో అపహరణకు గురైన వెండి చెంబులపై గురువారం సాయంత్రం మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలకు ఉపయోగించే 9 వెండి చెంబులు ఈనెల 11న రాత్రి అపహరణకు గురయ్యాయి. బీరువాను కట్‌ చేసి ఎత్తుకెళ్లారు. ఈ విషయం ఆలయ ఈఓ, అర్చకులు, కింది స్థాయి సిబ్బంది వరకు అందరికి తెలుసు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని అంచనా. కానీ, అపహరణ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఈ నోట ఆ నోట చెంబులు మాయమైన విషయం తెలియడంతో దేవాదాయ శాఖ ఉన్నతధికారులు ఆలయానికి వచ్చి విచారణ చేపట్టగా నీళ్లు నమలడం ఈఓ, సిబ్బంది వంతైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎట్టకేలకు గురువారం సాయంత్రం వేంకటేశ్వర ఆలయ ఈఓ రత్నాకర్‌ రెడ్డి మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై మట్టెవాడ ఎస్సై ప్రసన్న కుమార్‌ విచారణ చేపట్టారు.

పనిచేయని సీసీ కెమెరాలు..

దేవాలయంలోని సీసీ కెమెరాలను పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇందులో కొన్ని కెమెరాలు కొద్ది నెలలుగా పనిచేయడం లేదని సమాచారం. ఈ విషయంపై ఆలయ సిబ్బందిని ప్రశ్నిస్తే పనిచేస్తలేవని, వాస్తవమేనని పేర్కొనడం గమనార్హం. ఇంటి దొంగలు ఈ వెండి చెంబులను మాయం చేసి ఉంటారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలింది. కానీ, ఇన్నీ రోజులు ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు మరో కోణంలో విచారణ చేస్తున్నారు. దాతలు, భక్తులు భక్తి భావంతో అందచేస్తున్న వస్తువులు అపహరణకు గురికావడంపై పెద్ద చర్చ జరుగుతోంది. గతంలో అనేక మార్లు ఇలాంటి దొంగతనాలు జరిగినా ఆలయ నిర్వాహకులు మౌనం వహించడం వెనక ఆంతర్యమేంటని భక్తుల సందేహం.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- 8 మందిపై కేసు నమోదు



గుప్తనిధుల కోసం తవ్విన గుంత

చిట్యాల: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మీరా సమ్మయ్య ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టగా పోలీసులు గుట్టురట్టు చేసి 8 మందిని అరెస్ట్‌ చేశారు. ఎస్సై ఎండి.షాబాన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మీరా సమ్మయ్య ఇంట్లో గుప్తనిధులు ఉన్నట్లు అదే గ్రామానికి చెందిన మరో అజ్మీరా సమ్మయ్య భార్య అజ్మీరా విజయ కలలో (నిద్రలో) వచ్చిందని తెలిపారు. దీంతో భార్య భర్తలు ఇద్దరు కలిసి ములుగు జిల్లా జీవంతరావుపల్లికి చెందిన ఆలోతు రతన్‌సింగ్‌, ఒర్సుల రమేష్‌, పోలీయా రాజ్‌కుమార్‌, జంగాలపల్లికి చెందిన భీమగాని అశోక్‌, మంచిర్యాల జిల్లాకు చెందిన గొస్కుల ఓదేలు, ఈదులకంటి రాజుల సహకారంతో తవ్వకాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సమాచారం మేరకు దాడులు జరిపి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్‌ సిబ్బంది ఎండీ గౌస్‌, లాల్‌సింగ్‌, అస్లాంజాని, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

ఫామ్‌ ల్యాండ్‌ కొనండి బైక్‌ పొందండి...!
■32 వండ్ల మొక్కలతో వాస్తుకు అనుగుణంగా, పక్కా రిజిస్ట్రేషన్‌తో 242 గ॥ ఫామ్‌ ల్యాండ్‌ కేవలం 4 లక్షలకే కొనండి హీరో హోండా బైక్‌ ఉచితంగా పొందండి. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే. 9390111828. [WA-6967]

PLOT FOR SALE
■హైద్రాబాద్‌ ఫార్మ సిటీకి దగ్గరలో విల్లా ప్లాట్స్‌ & ఓపెన్‌ ప్లాట్స్‌ కలవు. గజం రూ॥ 10,999/- & 12,999/- మాత్రమే. వివరాలకు వెంటనే సంప్ర: 7989747927. [W-785566]

TDR FOR SALE
■TDR For Sale. క్యాష్‌కి బదులుగా FLATS కొనబడును. సంప్రదించండి: 9618442268, 9885301652. [W-785540]

FLAT FOR SALE
■KUDA కాలనీ, 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్‌ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-27063]
■121 Sq.Yds ప్లాట్‌ కేవలం 6 లక్షలు మాత్రమే మరియు 1200 Sft గేటెడ్‌ కమ్యూనిటి అపార్ట్‌మెంట్‌ ప్లాట్‌ కేవలం 45 లక్షలు మాత్రమే (WGL). 80% Loan (Limited Offer) సంప్ర: 9553182182. [W-785567]
■LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్‌ 9948525151, 6262838353 మార్కెటింగ్‌ కు ఏజెంట్లు కావలెను. [HA-3219]

HOUSE FOR SALE
■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్‌ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-27064]
■వరంగల్‌, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్‌ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్‌: 7660008666, 8309035091. [WA-27065]
■ములుగురోడ్డు కాకతీయ కెనాల్‌ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్‌: 7660008666, 8309035091. [WA-27066]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

SERVICES

అమ్మ హోం కేర్‌ సర్వీస్‌
■24 గంటలు వృద్ధులకు, పేషంట్లకు, బేబీకేర్‌, ఇంటి పని, వంట పనికి అనుభవం గల ఆయా వర్కర్లను మీ ఇంటికి పంపగలం. వరంగల్‌, సెల్‌: 8522903927, 9059835761. [W-785565]

WANTED
■HNK పబ్లిక్‌ గార్డెన్‌దగ్గర HP పెట్రోల్‌ పంపు నందు పెట్రోల్‌ & డీజిల్‌ ఫిల్లింగ్‌ చేయుటకు యువతీ / యువకులు కావలెను & వాహనాలకు ఎయిర్‌ ఫిల్లింగ్‌ చేయుటకు యువకులు కావలెను. సంప్ర॥ 9505919293. [W-785563]
■గ్రాఫిక్‌ డిజైనర్‌ & SEO స్పెషలిస్ట్‌ కావలెను. అర్హత: ఏదైనా గ్రాడ్యుయేట్‌. నైపుణ్యాలు: వీడియో ఎడిటింగ్‌ మరియు కంపెనీ వెబ్‌సైట్‌ నిర్వహణ. సంప్ర: 7799007778, 7799007776. [W-1002351]
■హన్మకొండ, వరంగల్‌ సిటీలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్‌, స్త్రీ/పు॥ హౌస్‌ కీపింగ్‌, సూపర్‌వైజర్స్‌ అర్జెంటుగా కావలెను. జీతం: 10000-15000. సంప్ర॥ 9703637320. [W-785561]
■ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌ టైమ్‌/ఫుల్‌టైమ్‌ పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్‌. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 8341371684. [G-786333]
■మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్‌ వాట్సాప్‌ చేయండి. వివరాలకు కాల్‌ చేయండి. 95736 33520, 90596 33520. [M-1190695]
■Looking For Sales Officer with 2 Years Experience In Agro Chemical Marketing In Telangana State. 12Posts To be Filled Email : hr@hifield-ag.com Please Call : 7770008039 / 8380012271. [H-797475]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్‌ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్‌ 9010144453
జయశంకర్‌ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.